న్యూ గ్లోబల్ ఆర్డర్... సూపర్ పవర్‌గా భారత్!!

ఆసియా ప్రాంతంలో స్థిరత్వ శక్తిగా భారత్ మంచి గుర్తింపు సాధించింది. దేశ నాగరికత, చరిత్ర, సంస్కృతిలో అంతర్భాగమైన సహనశీలత్వం.. అరాచక ఆలోచనలను, శక్తులను దీటుగా ఎదుర్కొనే శక్తిసామర్థ్యాలు.. సరికొత్త ఆర్థిక క్రియాశీలత.. ఈ గుర్తింపునకు దోహదం చేసింది. మరోవైపు భౌగోళీకరణ అంతర్జాతీయ సమీకరణాల్లో మార్పులను వేగవంతం చేసింది. ఆ క్రమంలోనే ప్రపంచ యవనికపై ఆసియా వినూత్న శక్తిగా ఆవిర్భవిస్తోంది. ఆసియా అంటే... మరేదో కాదు.. భారత్, చైనాలే!! ఈ రెండు దేశాలు.. వడివడిగా.. దృఢంగా సాధిస్తున్న ఆర్థిక ప్రగతి ప్రభావం.. లాటిన్ అమెరికా, ఆఫ్రికా ఖండ దేశాల వరకు వ్యాపించడం విశేషం!!

చైనా దివంగత నేత డెంగ్ జియాపింగ్ పేర్కొన్నట్లు... చైనా, భారత్ ప్రస్తావన లేకుండా... ఈ రెండు దేశాలు కీలక పాత్ర పోషించకుండా.. ఆసియా-పసిఫిక్ కానీ, ఆసియా శతాబ్దం కానీ లేదు, ఉండబోదు. చైనా, జపాన్, ఇండోనేషియాలతో పాటు... భారత్, ఆసియాకు మూల స్తంభం అన్నది భారత విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ నిశ్చితాభిప్రాయం. ఆర్థికంగా, రాజకీయంగా... ఆసియా వినూత్న శక్తిగా ఆవిర్భవిస్తోంది. ఆసియా ప్రత్యేకత ఏమంటే... ఈ ప్రాంతం విభిన్న సంస్కృతుల సమ్మేళనం. అందువల్ల ఆసియాలో సహకారాత్మక బహుళ ధ్రువ వ్యవస్థ అవసరం. అలాంటి బహుళ ధ్రువవ్యవస్థ మాత్రమే 21వ శతాబ్దం విసిరే సవాళ్లను దీటుగా ఎదుర్కోగలదు. మరోవైపు భౌగోళీకరణ, ప్రాంతీయ ఏకీకరణల నేపథ్యంలో సరికొత్త ఆర్థిక శక్తులు తెరపైకి వస్తున్నాయి. అంతర్జాతీయ వ్యవహారాల్లో.. ఇతర దేశాల చర్యలను మౌనంగా చూస్తూ కూర్చునే స్థితిలో ప్రస్తుతం భారత్ లేదు. అంతర్జాతీయంగా రోజురోజుకూ పెరుగుతున్న దేశ ప్రాధాన్యాన్ని విదేశాంగ విధాన వ్యూహకర్తలు గుర్తించాల్సిన అవసరం ఎంతో ఉంది. భారత విదేశాంగ విధానానికి సవాలు... దాని మైండ్‌సెట్ మార్చుకోవడమే అన్న అభిప్రాయం ఉంది. భారత్ గతాన్ని పట్టుకొని వేలాడటం సరికాదని.. మారుతున్న ప్రపంచ పోకడలకు అనుగుణంగా... ఎప్పటికప్పుడు తన వ్యూహాలను మార్చు కునేవిధంగా సరళత్వాన్ని సంతరించుకోవాలని ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ కూడా అభిప్రాయపడ్డారు.

ఆర్థిక ప్రయోజనాలకు పెద్దపీట:

సరికొత్త మార్కెట్ల సౌలభ్యం.. ఇంధన వనరులు.. పెట్టు బడులు.. అధునాతన టెక్నాలజీ.. దేశ విదేశాంగ విధానానికి కొత్త సవాళ్లు విసురుతోంది. ఇది భారత విదేశాంగ విధానాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనుంది. దాంతో ముఖ్యమైన వాణిజ్య భాగస్వామ్య దేశాలతో.. పొరుగునున్న ఇతర ఆసియా దేశాలతో.. అభివృద్ధి చెందుతోన్న దేశాలతో... భారత్ వినూత్నంగా వ్యవహరించాల్సిన అవసరం ఏర్పడింది. 11వ పంచవర్ష ప్రణాళికలో 9 శాతం నుంచి 10 శాతం జీడీపీ వృద్ధి రేటు... 12వ పంచవర్ష ప్రణాళికలో

అంతకంటే ఎక్కువ ప్రగతి సాధించడం... భారత్ తన లక్ష్యంగా నిర్దేశించుకుంది. దేశ విదేశాంగ విధానం ఈ ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగానే ఉండాలి. విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ మాటల్లో చెప్పాలంటే...''భారత విదేశాంగ విధానం.. దేశ నిర్మాణాత్మక ఆర్థిక ఎజెండాకు అనుకూలంగా ఉండాలి''!. 1990లలో భారత్ ''లుక్ ఈస్ట్'' పాలసీని తెరపైకి తెచ్చింది. తదనంతరకాలంలో... ఆ ప్రాంత దేశాలతో భారత వాణిజ్యం 8.1 బిలియన్ల డాలర్ల నుంచి 67.5 బిలియన్ల డాలర్లకు పెరిగింది. భారత విదేశీ వాణిజ్యంలో ఈ దేశాల వాటా... 19.4 శాతం నుంచి 28.2 శాతానికి చేరుకుంది. భారత 'లుక్ ఈస్ట్' విధానానికి దక్షిణాసియా తొలి మజిలీ వంటిదని విదేశాంగ మంత్రి ప్రణబ్‌ముఖర్జీ పేర్కొన్నారు.

నేటి నాలెడ్జ్ యుగంలో... సవాళ్లతోపాటు అవకాశాలూ విస్తృతమవుతున్నాయి. భారత్ సవాళ్లను ఎదుర్కొంటూ.. అవ కాశాలను అందిపుచ్చుకోవాలి. భారత ప్రజలు కూడా ఈ పరిణామాలను గమనించాలి. భారత శక్తిసామర్థ్యాలు.. జాతీయ లక్ష్యాలు.. విదేశాంగ విధానాల మధ్య అంతరం లేకుండా చూసు కోవాలి. భారత ఆర్థిక, సాంఘిక సుద్రుడ ప్రగతికి దోహదపడే అంతర్జాతీయ పరిస్థితులను కల్పించుకునే విధంగా దేశ విదేశాంగ విధానం ఉండాలి. భారత్ పొరుగున ఎప్పుడూ ఏదో ఒక అలజడి ఉండనే ఉంటోంది. అందువల్ల ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలను నెలకొల్పడం.. పరస్పర సహకార ధోరణిని పాదు కొల్పడం.. భారత్‌కు నిజంగా సవాలే! దాంతో పాటు చైనా ఆర్థిక ప్రగతి, ప్రపంచ అగ్రరాజ్యంగా ఆ దేశం ఎదుగుతున్న వైనం నుంచి భారత్ నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. భారత్, చైనా ప్రస్తుతం నిర్మాణాత్మక ద్వైపాక్షిక చర్చలు కొనసాగిస్తున్నాయి. కలిసి అభివృద్ధి సాధించడానికి, కలిసి ఎదగడానికి రెండు దేశాలకూ కావలసినంత అవకాశముందని ఇరు దేశాలు భావిస్తుండటం మంచి పరిణామం. మరోవైపు కొన్ని ఇస్లామిక్ దేశాల్లో ప్రస్తుతం నెలకొన్న అస్థిర పరిస్థితులను కూడా లోతుగా విశ్లేషించాల్సి ఉంది. ప్రపంచంలో నాగరికతల ఉత్థాన పతనాలకు కారణాలపై దౌత్యవేత్తలు సంపూర్ణ అవగాహన కలిగుండటం అవసరమని భారత ప్రధాని మన్మోహన్ సింగ్ సూచించారు.

శాంతిభద్రతలు-సుస్థిరత:

ప్రజలు ప్రగతి సాధించాలన్నా.. వ్యాపార, వాణిజ్యాల్లో అవకాశాలు మెరుగవ్వాలన్నా.. ఆర్థిక అభివృద్ధి చోటుచేసుకోవాలన్నా... శాంతిభద్రతలు ముఖ్యం. అంతే కాకుండా.. ఈ ప్రాంతంలోని దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు బలపడాలంటే.. శాంతి భద్రతల విషయంలో పరస్పర సహకారం పెంపొందాలి. నేడు దేశాల మధ్య శాంతికి, దేశాల్లో అంతర్గత శాంతిభద్రతలకు ప్రధాన ముప్పు యుద్ధాలు కాదు, ఉగ్రవాదం, సీమాంతర ఉగ్రవాదమే నేటి ప్రధాన శత్రువు. ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు అంతర్జాతీయ స్థాయిలో ఆయా దేశాలు సహకరించుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న

భద్రతపరమైన లోటుపాట్లను అధిగమించేందుకు భారత్ తన వంతు ప్రయత్నంచేస్తోంది. అందులో భాగంగానే 'కనీస నిరోధక న్యూక్లియర్ డాక్టరైన్' వంటి రక్షణ సన్నాహక చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం భారత రక్షణ వ్యయం జీడీపీలో 2.5 శాతంగా ఉంది. ఇది భారత అభివృద్ధి ప్రాథమ్యాలకు ఏ విధంగానూ ఆటంకంకాదని రక్షణ మంత్రి స్పష్టంచేశారు.

సముద్ర దొంగలు, ఉగ్రవాదుల బెడద నుంచి... వ్యూహాత్మక ''మలక్కా'' జలసంధి రక్షణ విషయంలో సహకరిం చేందుకు భారత్ సంసిద్ధత తెలిపింది. ఇందుకోసం భారత్ తన వద్ద ఉన్న నౌకాయాన సాంకేతిక నైపుణ్యాన్ని అందించేందుకు, మలక్కా రక్షణ కోసం తూర్పు ఆసియా దేశాలు చేపట్టే ప్రాజెక్టుకు సహకరించేందుకు కూడా ముందుకొచ్చింది. భద్రతపరమైన అంశాలపై భారత్, ఆసియాన్ దేశాల మధ్య సంప్రదింపులు జరుగుతూనే ఉన్నాయి. శాంతిభద్రతలు, సుస్థిరత... సముద్ర తీరంలో నిఘా, కమ్యూనికేషన్‌లు... ఈ ప్రాంతంలోని ఆయా దేశాల ఉమ్మడి ప్రయోజనాలకు దోహదం చేస్తుంది. అఫ్గానిస్థాన్, ఇరాన్, ఇరాక్ సమస్య.. ఉగ్రవాదం.. జనహనన ఆయుధాలు.. ప్రస్తుతం దేశాల భద్రత అజెండాలో ప్రధానాంశాలు. ప్రధానంగా ఉగ్రవాదం, జనహనన ఆయుధాల విషయంలో... భారత్, చైనా, పాకిస్థాన్‌ల మధ్య సానుకూల చర్చలు మంచి ఫలితాలను ఇచ్చే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బహుళ ధ్రువ వ్యవస్థ:

అమెరికా ఏకైక అగ్రరాజ్యంగా కొనసాగుతున్న ఏక ధ్రువ ప్రపంచం కారణంగా.. ఐక్యరాజ్యసమితి పోషించాల్సిన పాత్రపై స్పష్టత లేకుండా పోయింది. ఇది అంతర్జాతీయ వ్యవహారాల్లో ఒక విధమైన అస్థిరతకు దారితీస్తోంది. ఈ తరుణంలో.. అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలు భారత విదేశాంగ విధానానికి సవాలుగా మారాయి. మరోవైపు ఇటీవల కాలంలో.. అమెరికా, రష్యా, చైనా, జపాన్, ఐరోపా దేశాలతో.. భారత సంబంధాలు చెప్పుకోదగ్గ స్థాయిలో పటిష్టమైనప్పటికీ.. మరింతగా ముందు కెళ్లడానికి ఎంతో అవకాశముంది!!